# నూరేళ్ళ తెలుగు కథకు 'నవ్య' నీరాజనం

సరికొత్త శీర్షిక ప్రారంభం



గొప్పకథల సృజనకారుడు కారా కోణంలో నిన్నటి కథనుంచి ఇప్పటి కథ ఏం నేర్చుకొని ప్రయాణిస్తోంది?

వర్తమాన కథాంశాలు రేపటి కథలో ఏఏ మార్పులు చేసుకొని ముందుకు రాబోతున్నాయి?

వీటన్నిటినీ కారా మాస్టారు తూకంవేసి చెప్పేముందు ఒక చిన్నసంగతి.. ఒకసారి కారా మాస్టారు హైదరాబాద్ వచ్చారు. కూకట్‌పల్లినుంచి మాస్టారు బయటకెళ్లటానికి సిద్ధంగా వున్నారు. ఆ సమయంలో ఓ ఔత్సాహిక కథకుడు మాస్టారును కలిశాడు. ఈ కథకుని చేతిలో ఆరేడు కథలు వున్నాయి. మాస్టారుకి వాట్ని అందించాడు. కారామాస్టారు తరువాత

## 'యజ్ఞం' రాసి కథకుణ్ణి అయ్యాను!!

రమ్మంటారని ఈయన అనుకున్నాడు. మాస్టారు మాత్రం 'నాయనా నేను లక్డీకాపూల్ వెళుతున్నా...! మీ కభ్యంతరం లేకపోతే ప్రయాణంలో వీలైనంత చదువుతా. మీరూ నాతో వస్తే వీటిగురించి చెబుతా' అన్నారు. ఇంతకుముందు పేరుమోసిన రచయితల చుట్టూ కథలు పట్టుకొని తిరిగిన ఈ ఔత్సాహికునికి వెంటనే అభిప్రాయం చెబుతాననడం పండగే అయ్యింది. కూకట్‌పల్లి టు లక్డీకాపూల్ ఆటో ప్రయాణం. గమ్యానికి వెళ్లేసరికి మాస్టారు నాలుగు కథలు చదివేశారు. అక్కడ ఒక చెట్టుకింద రెండున్నర గంటలు మంచికథకోసం విశ్లేషణలు, సూచనలు, అభిప్రాయాలు, అనుభూతులను ఔత్సాహికునికి అందించారు. తెలుగు కథపట్ల అనురాగం, అంతకంటే మంచికథకోసం కారా మాస్టారి తపన ఎటువంటిదో తెలిపే సంఘటనల్లో ఇదొకటి - ఇంటర్వ్యూను ఇక్కడినుంచే ప్రారంభించా..

## కారా కిళ్ళీ కట్టు విధంబు ఎట్టిదనిన....



### ఇంత అభిమాన క'థనం'ఎక్కడిది?...

'జీవితంలో కొన్ని పనులు జరుగుతుంటాయి. చెడ్డవి, మంచివి కూడా. వాటిగురించి మాట్లేడేటపుడు చెడ్డవి జరగడానికి కారణం ఇతరులో, ఇతర పరిస్థితులో అనేస్తుంటారు. మంచి జరిగితే అది తానే చేసినట్టు మాట్లాడుతారు. మొదటి దాని సంగతి అలా వుంచండి. రెండో వాటి విషయానికొస్తే మన ప్రమేయం కొంత వున్నా, మనం చేసే ప్రతీ మంచి పని వెనుకా ఎంతో మంది మంచివారి ప్రభావం వుంటుంది. అంతేకాదు స్థల, కాలాదుల ప్రమేయమూ ఉంటుంది. ఆనాటికి మనమున్న ప్రాంతపు రాజకీయ, సామాజిక పరిస్థితుల ప్రభావమూ చాలా వుంటుంది. ఇది ఇప్పటి నా అవగాహన.

### నేను అనుకోవడం...

1. నేను 1924లో పుట్టాను. అలా కాకుండా మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత లేకా అంతకన్నా వెనక పుట్టుంటే 'యజ్ఞం' లాంటి కథలు రాయగలిగేవాన్ని కాదు.
2. నా జన్మస్థలం శ్రీకాకుళం-విజయనగరంల మధ్య రోడ్డుకు సముద్రానికి వుండే 'కరవాకు పట్టి'. అక్కడ కాకపోయివుంటే 'ఆర్తి'లాంటి కథలు రాయలేకపోయేవాన్ని.
3. నాన్న ఏడూర్లకు కరణం. అమ్మ పుస్తకం చదివేపాటి అక్షరజ్ఞానం వున్నామె. అలనాటి గ్రంథాలయోద్యమ ప్రభావంతో చిన్నదే అయినా మా ఊర్లో ఒక గ్రంథాలయం ఏర్పడింది. మా తండ్రి గ్రామకరణమే అయినా ఆనాటి ఒక మహామనీషికి, పండితునికి రక్త బంధువు. వారి కుటుంబంతో మా కుటుంబానికి రాకపోకలు తెగిపోయినా ఆ మేనమామ ప్రభావం నాన్నపైవుండేది. వీధి చదువు, నాలుగోతరగతి దాటకపోయినా స్వయం కృషితో ఇతిహాసాలు, ప్రబంధాలు చదివి అర్థం చేసుకోగలిగే స్థితికి రాగలిగారు. మా అమ్మానాన్నలకు పుస్తకాలు చదివే అలవాటు లేకుంటే, ఊళ్లో గ్రంథాలయమే లేకుంటే నా చదువు పరీక్షలకే పరిమితమయ్యేది.
4. బాల్యంలో మా పెత్తల్లి కథలు చెప్పకుంటే, ఇంకో ఊర్లోవుండే దొడ్డమ్మ ఇంట్లో పాతకాలపు కథల పుస్తకాలే లేకుంటే ఈనాటికీ కథపై కొనసాగుతున్న నా మమకారం ఇంకోలా వుండేదనకుంటాను.

ఈ నేపథ్యంలో చదువుతో ఆరంభమయిన నా సాహితీయాత్ర 1942లో రచనా రంగాన్ని కూడా భాగం చేసుకుంది. రచన 1942లో ఆరంభించి రాసి... రాసీ, చింపీ... చింపే దశ దాటి 1943లో చిత్ర గుప్తలో 'కార్డుకథ'గా అచ్చుముఖం చూసింది. ఆనందవాణి, తెలుగు స్వతంత్ర, రూపవాణి మొదలైన పత్రికలను దాటి ఆనాటి ప్రతిష్టాత్మక పత్రికలు ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలలో స్థానం సంపాదించుకుంది. నా రచనలు ఈ స్థాయికి చేరుకోడానికి కూడా బాటలు వేసి నడిపించిన పరిస్థితులు, ప్రభావాలు వున్నాయి.

పద్దెనిమిదేళ్ల వయసులో గుర్తింపుకోసం అల్లల్లాడే ప్రాణికి...! మార్గదర్శకత్వం చేసేలా ఏ అనుభవజ్ఞుని అండా లభించని పరిస్థితులలో నా ప్రయత్నాలు బహుముఖంగా సాగాయి. ఒక నవల రాసే ప్రయత్నం... పెన్సిల్ డ్రాయింగ్‌తో బొమ్మలు గీసే ప్రయత్నం... బంక మట్టితో శిల్పాలు తయారు చేయాలనే ప్రయత్నం... హార్మోని, మద్దెల వంటి వాయిద్యాలు నేర్చుకునే ప్రయత్నం... కవిత్వం రాయాలనే ప్రయత్నం... ఇలా ఎన్నెన్ని పోకడలు పోవాలో అన్నీ పోయింది. ఈ విపరీతాలని గమనించి నాన్న మందలించారు. ఏదో ఒక దానిమీదే దృష్టిపెట్టమన్నారు. ఒక స్థాయికెదిగాక ఇంకేదైనా నేర్చుకోవాలంటే నేర్చుకో అన్నారు.

చుట్టరికానికి విశాఖవెలితే అద్భుతమైన హిందూ రీడింగ్ రూమ్‌లో వేలపుస్తకాలు, వందల పత్రికలు నా కళ్లకు బంధనాలేశాయి. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ అక్కడే వుండిపోయాను. (ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయం తారసపడి వుంటే ఉద్యోగాలకు బదులు చదివేవాన్నేమో) ఆఫీసులో పనిచేసినన్ని గంటలు పనిచేసి మిగిలిన సమయం ఎంతైనా చదువుకు చాలేదికాదు. బెంగాలీ మహారచయితల అనువాదాలు, చలం, కుటుంబరావు, శ్రీపాదలను ఆరంభించి నాటి వరకూ రాసినవాడు, రాస్తున్న వాడు అందరూ నన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు.

పత్రికల్లో నా వంటి పచ్చి మొగ్గలు రచనలతో సహా పంతులు శ్రీరామశాస్త్రి తరానికి చెందిన సిద్ధహస్తులు రాస్తే వీటన్నిటినీ చదివాను. వీరందరూ ఎలా రాయకూడదో, ఎలా రాయలో నేర్పిస్తూ వుండేవారు.

ఇంత విషయం బోధపరిచేదేమిటంటే -ఆనాటి మొత్తం కథాసాహిత్య ప్రభావమే నామీద లేకుంటే తెలుగులో మరో శరత్‌బాబులా రాయడానికి ఇప్పటికీ ప్రయత్నిస్తూ, రాయలేక బొక్కబోర్లా పడుండేవాన్ని. తరువాత సత్‌అసత్ సంశయంలా

## నచ్చినవి....

**సినిమాలు:** మాయాబజార్, దశావతారం

**హీరోలు :** ఎస్వీరంగారావు, కమల్‌హాసన్

**హీరోయిన్లు :** భానుమతి, త్రిష

**దర్శకులు:** బాపు, కె విశ్వనాథ్

**నవల:** ఒక్కటేమిటి? చాలా వున్నాయి

**కథ :** తప్పు(రావి శాస్త్రి)



ఫొటోలు : ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు

కొట్టిమిట్టాడుతున్న నాకు రావిశాస్త్రి, ఆయన మిత్రుల పరిచయ స్నేహాలు లభించడం రచయితగా నాకొక వరమయ్యింది. నా మంచి కథల పుట్టుక వెనుక నా ప్రమేయం ఎంతవుందో అంతకంటే ఎక్కువగా ఇలా చాలా విషయాల ప్రభావమూ వుందని నేను నమ్ముతున్నాను.

## తనను తాను తెలుసుకుంటూ... ముందుకు నడిపిస్తూ

నేను కథకున్ని, సాహితీ చరిత్రకారున్ని కాదు. పాశ్చాత్య దేశాల్లో స్టోరీ, షార్ట్‌స్టోరీ ప్రక్రియలు పద్దెనిమిదో శతాబ్దంలోనే లేదా అంతకుముందే పుట్టాయని విన్నాను. తెలుగులో ఆధునిక కథా ప్రారంభం పంతొమ్మిదో శతాబ్దం చివరి దశకంలోనూ, ఇరవైశతాబ్దం ఆరంభంలోనూ పుట్టివుంటుంది. ఈ కథని లోగడ చెప్పిన కథల్నీ పరిశీలిస్తే ఒక ముఖ్యమైన తేడాని గమనించవచ్చు.

మానవ సమాజాల్లో అనూనాసంగా వ్యాప్తిలో వున్న కథలను ఒక వాల్మీకో, ఒక వ్యాసమహర్షి రామాయణ కావ్యంలోనూ, భారతేతిహాసాలను సంస్కృతంలో గ్రంథీకరించి వాటికి స్థిరత్వం, శాశ్వతత్వం కల్పించి వుంటారు. ఉత్తర దక్షిణాల వివిధ భారతీయ భాషల్లో నిష్ణాతులైన మహాకవులు వాటిని ఆయా భాషల్లోకి పునర్నిర్మించి వుంటారు. గ్రంథస్థం చేసిన వారు పైన పేర్కొన్న వారే కానీ ఆ కథల కర్తలు వారు కాదు. అలానే మదిర సుబ్బన్న దీక్షితులు వంటివారు తమ భావుకత, కవితాత్మ భాషా వైదుష్యం జోడించి ప్రజాబాహుల్యంలో ప్రచారంలో వున్న కథలని అత్యంత హృద్యంగా, కాశీమజిలీ కథలుగా గ్రంథస్థం చేసి వుంటారు.

తక్కిన భాషల సంగతి నాకు తెలియదు గానీ తెలుగులో వచ్చిన తొలిదశ కథలు ప్రతీ దానికీ ఒక కర్తను చూడవచ్చు. అది ఏదో ఒక పత్రికలో ప్రకటింపబడి వుంటుంది. సాధారణంగా ప్రతికథ లోని అంశం తమ జీవితానుభవం నుంచో లేదా ఇరుగు పొరుగుల, బంధువుల జీవితాల నుండో తీసుకున్నదై వుంటుంది. కొన్నింటి కథాంశాలు విన్నవిగా, కన్నవిగా అగుపిస్తాయి. మనిషి శైశవదశలో అనుకరణా, చిలకపలుకులు దాటి భావవ్యక్తీకరణ స్వతంత్రంగా సాగినట్టే ఆనాటి మన కథ శైశవ దశ గడిచింది

ఆంగ్లవిద్యతో బాగా పరిచయం వుండిన గురజాడ, చలం, కుటుంబరావు ఇత్యాదులు, స్వతంత్ర వ్యక్తిత్వమున్న శ్రీపాద మొదలైన వారు కథను నడిపించడం చేత ఉద్యమాల చోదకశక్తికి వస్తు పుష్కలత తోడయ్యింది. ఇక మూడోదశాబ్దంలో ప్రారంభమైన రావిశాస్త్రి నాటికి వస్తుపరంగానే కాకుండా శిల్పపరంగా కూడా బాగా అభివృద్ధి చెందింది. తొలి దశలలో రాసే వాళ్లు, పత్రికల్లో వేసుకునే వాళ్లు, చదువర్లు కూడా అల్పసంఖ్యాక వర్గానికి చెందిన వారే.

స్వతంత్రం అనంతరం విద్యావ్యాప్తి, ప్రచురణ రంగం బాగా పెరుగుతూ రావడంతో రాసేవారి సంఖ్య, చదివే వారి సంఖ్య నగరాల్లోనే కాక గ్రామాల్లో కూడా బాగా పెరిగింది. అయితే కథ విస్తృతి ఇంతగా పెరిగినా ఆనాడు నవలకుండిన ప్రచారం పుస్తక ప్రచురణ రంగాన్ని పూర్తిగా కైవసం చేసుకొని కవితకే కాక కథకి కూడా చోటు లేకుండా చేసింది. ఆరోజుల్లో ఒక సంవత్సరమంతటకీ వచ్చిన కథాసంపుటాలు, సంకలనాలు మొత్తం పదైనా వుండేవి కావు.


## ఉద్యమంతో పురోగమనం...

తెలుగు కథ ప్రధాన స్రవంతి ఆది నుంచీ ఏదో ఒక ఉద్యమం ప్రేరణతో ఆ ఉద్యమానికి బాసటగా పురోగమిస్తూ వచ్చింది. మొదట్లో సంఘసంస్కరణలు, అభ్యుదయోద్యమం, విప్లవోద్యమం జనసామాన్యాన్ని ఏ మేరకు చైతన్యవంతం చేసిందో అన్న అంశం పక్కన వుంచితే అట్టడుగు వర్గాల నుంచీ మధ్యతరగతి స్థాయికి ఎదిగి పై స్థాయిలకు అర్రులు చాసే కొన్ని సమూహాలను బాగా చైతన్యవంతం చేయడంతోపాటూ పోరాడితేగానీ ఏమార్పురాదు, ఏ కాస్త సౌకర్యం లభించదు అన్న నిర్ద్వంద్వమైన అవగాహన కలిగించింది. ఫలితంగా స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాదం పుట్టి ఎందరెందరో కొత్త రచయిత్రులను, రచయితలను సాహితీరంగంలో ముఖ్యంగా కథారంగంలో ప్రవేశపెట్టింది. ఒకప్పుడు నిశిత దృష్టి, లోతైన అవగాహనాశక్తి, అద్భుతమైన రచనాపాటవం కలిగిన వారు మాత్రమే స్వానుభవం కానిది, ఇతర వర్గాల జీవితాల, ఇతర కులాల జీవితాలు, ఇతర ప్రాంతాల జీవితాల కొద్దో గొప్పో పరిచయం ఆధారంగా సత్యానికి, గురికి బారెడుగానో, బెత్తెడుగానో దగ్గరగా చిత్రీకరించే వారు. ఇప్పుడు అంతటి కథా నైపుణ్యం కలిగిన వారు, దాదాపు అంతటి నైపుణ్యం సాధించిన వారందరూ స్వీయ అనుభవం కలవారు ప్రాంతీయ భేదాలకతీతంగా తెలుగుజాతి రాజకీయ, సామాజిక, సంస్కృతీ, సమస్యలు మొదలైన వాటిపై సాధికారికమైన అవగాహన్ని తమ రచనల ద్వారా పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

## రాబోయే మార్పులను ఊహించితేనే...

మానవ అవసరాలు, ఆ అవసరాలకోసం మానవుడు ప్రకృతితోనూ, తోటి మనుషుల తోనూ చేస్తున్న పోరాటం, మానవమేధ కనుగొనబోయే కొత్త ఇన్వెన్షన్స్ ఎలా ఉంటాయో ఊహించగలిగితే తప్ప కథ భవిష్యత్ ఊహించలేము. చాలా కాలం కథలు వినేవాళ్లం, ఆతరువాత చదివేవాళ్లం, ఇప్పుడిప్పుడే చూస్తున్నాం (టీవీ, సినిమా, నెట్‌లో చూస్తూ చదవడం) ఇలా కొనసాగుతున్నాం. అలా యుగాల క్రితం పుట్టిన కథ ఈనాటి వరకూ సాగుతూనే వస్తోంది. మనుషులందరూ అంతరించి ఇద్దరు మనుషులు మిగిలేంత వరకూ కథ ఏదో రూపంలో వుండాల్సిందే.

## యువకులూ ...వినదగునెవ్వరు చెప్పినా


భార్య సీతామహాలక్ష్మితో....

'ఏకాలంలోనూ నూటికి నూరు కథలు మంచివి అయ్యుండవు. ఇప్పటికి తెలుగులో లక్షా రెండు లక్షల కథలు పత్రికల్లో వచ్చుంటాయి. ఎన్నికథలు మిగిలాయి. పదివేల మందికి పైగా రాశారు. తరువాత తరాలు ఎంతమందిని గుర్తించుకున్నాయి? అందుచేత ఇప్పుడొస్తున్న కథల్లో కూడా కలకాలం నిలిచేవి కచ్చితంగా కొన్ని వున్నాయి. పేర్లు చెప్పమంటే జ్ఞాపకశక్తి చాలదు. పెద్దలు చెప్పేమాట వినడం ఒకప్పటి పద్ధతి. స్వతంత్రంగా ఆలోచించి తమ బాటను తామే వేసుకోవడం ఇప్పటి వారి పద్ధతి. వినదగునెవ్వరు చెప్పిన... అనే పద్యం మననం చేసుకుంటే మంచిది. నేను అలానే చేస్తున్నాను'.

- బల్లెడ నారాయణమూర్తి

నాకు నచ్చిన నా కథ

# అర్థం కాని మానవ గాథ

కాళీపట్నం రామారావు

నారాయణగారి తత్వం ఆయన బ్రతికినన్నాళ్లే కాకుండా చనిపోయాక కూడా ఆశ్చర్యకరమే అయింది ఆ గ్రామవాసులకు. ఇప్పటికి పదిహేనేళ్ల క్రిందట తనూ, భార్యా, యిద్దరు పిల్లలతో వచ్చాడు ఆ గ్రామం. ఆ సరికి పెద్ద కుఱ్ఱాడికి ఏడేళ్లూ, చిన్నవాడికి అయిదేళ్లూ వుంటాయి.

సహజ కౌతుక స్వభావులయిన పల్లీయులు అతని చరిత్ర తెలుసుకోడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. కాని విఫలులయ్యారు. భోగట్టాలు లాగడంలోనూ, ప్రచారం చేయడంలోనూ అసాధారణ ప్రజ్ఞగల స్త్రీ జనమే - విఫలులయ్యారు. ఇందులో కిటుకేమంటే నారాయణగారుగాని, ఆయన భార్యగాని ఎన్నడూ ఉబుసుపోక కోసరం బయటకు వచ్చేవారు కారు. పోతే మిగిలిన మార్గం ఆ పిల్లలను కంగించటం. వాళ్లయినా అసాధ్యులుగా గోచరించేవారు. బాతాఖానీకి దించేసరికి 'పనుందండీ' అంటూ వెళ్లి పోయేవారు. సుమారు ఆరు మాసాలు యిలా గడిచేయి.

విఫలులైన గ్రామీయులు యీలోగా ఆ కుటుంబపు బాహ్య గోచర ప్రమేయాల నుండీ, అతి ప్రయాసం పైన సాధించిన చిన్నచిన్న భోగట్టాలనుండీ, వాళ్ళ ఊహాగాన నైపుణ్యాన్నుపయోగించీ ఒక కథ అల్లుకుని చెప్పుకుంటూ సంతృప్తి పడి వూరుకున్నారు.

ఆ కథ యిదీ -

'వాళ్ళు బ్రాహ్మణులు. కాస్త వున్నవాళ్ళేను. సుమారు ఎనభై తొంభై తులాల బంగారం బ్రాహ్మణి వంటి మీద వుంది. ఆయనేదో పెద్ద వుద్యోగమే చేసేవాడట. ఆ యజమానితో రగడ వచ్చి విడిచిపెట్టేసి యిలా వచ్చాడట-'

యిక్కడ ఒక కథాంతరం ఉంది-

'యేదో పెద్ద వుద్యోగం చేసి వుండడం ఖాయమే! కాని ఆ ఉద్యోగం విడిచి పెట్టటానికి కారణం మాత్రం అదికాదు. లంచాలు బాగా తినేవాడట. ఏదో లంచం కేసులో పట్టుబడి జైలుకు వెళ్లి- ఆ మచ్చ మాపుకోడానికి యిలా అజ్ఞాతవాసం చేస్తున్నాడట. ఆ నున్నని తలా, ఆ నున్నని మీసం వాటి చిహ్నాలేనట-'

పై రెండు కథాంతరాలలోనూ రెండవదే ఎక్కువ ప్రచారంలో ఉండేది.

'- యేది యేమైనా మనుష్యులు చాలా మంచివారు. ఎదుటివారికి మర్యాద యిచ్చి మర్యాద పుచ్చుకుంటారు. వాళ్లు ఒకళ్ల జోలికి పోరు - యింకొకరిని తమ జోలికి రానీరు-'

యిదీ కథ. తర్వాత కథ అందరికీ తెల్సు- తమ పొరుగు శ్రీరాములు నాయుడుతో చెయ్యి కలిపి వర్తకంలో వంతు తీసుకున్నాడు.

శ్రీరాములు నాయుడుగారు ఆ ప్రాంతాల ప్రసిద్ధి కెక్కిన పొగాకు, వేరుశనగ వర్తకులు. చాలా మంచివాడు. మితభాషి. ఎవరితో జోక్యం కల్పించుకున్నా వ్యవహార రీత్యా ఎంతవరకూ మాట్లాడాలో అంతవరకే మాట్లాడుతారు. బహు ఖచ్చితమైన వ్యక్తి. మంచి వ్యవహర్త.

మూడేళ్లు కావోలు శ్రీరాములు నాయుడుగారితో కలిసి వర్తకం చేశాడు. మూడేళ్లలోనూ మూడువేలు సంపాయించేడు. ఆ తర్వాత విడిపోయి వేరే వర్తకం పెట్టాడు. మరి అప్పణ్ణుంచీ అతని ఆదాయం సంగతి ఎవరికీ తెలియదు. కాని మొత్తం ఆస్థంతా నేటికి యిరవై వేలకు తక్కువ వుండదని అంచనా.


యింక ఖర్చు విషయంలో పిసినారని చెప్తారు. దానికి కారణాలు -



భార్య పుట్టెడు జబ్బుతో బాధపడుతుంటే యేవేవో మందులూ మాకులూ తనే యిచ్చాడట కాని ఎంతమంది చెప్పినా విశాఖపట్నం కాకపోతే అదే పోయెను – దగ్గర హాస్పిటల్‌కైనా తీసుకుపోలేదు. చివరకా యిల్లాలు అలానే పోయింది. ఆమె పోయి అంతా రెండేళ్లయింది.

ఆ కొడుకుల విషయంలోనూ అంతే.

పెద్దవాడు స్కూలు ఫైనల్ పేస్ అవగానే మానిపించేశాడు. పాపం ఆ కుర్రాడు పై చదువుల కోసరం చాలా ప్రయత్నం చేశాడు. కాని లాభం లేకపోయింది. చివరకు విసిగి టైపూ-షార్టు హేండూ నేర్చుకొని ఏదో ఫరంలో స్టెనోగ్రాఫరుగా కుదురుకున్నాడు నాలుగేళ్లయి.



తర్వాత రెండవ వాడు కూడా స్కూలు ఫైనల్ పాసయ్యాడు. వాడి చదువు కూడా ఆపెయ్యబోతే పెద్దవాడు అడ్డుపడి తను చదివిస్తానంటూ వాణ్ణి తనతో తీసుకుపొయ్యాడు. వాళ్లకు దమ్మిడీ పంపడు. దమ్మిడీ అడగడు.

ఆ తర్వాతే తల్లిపోవడం.

తల్లి అంత జబ్బుతో బాధపడుతున్నా యిలా వుందనైనా వ్రాశాడు కాడట– కొడుకులకు. తర్వాత యింక గడియో క్షణమో అనగా టెలిగ్రాం యిచ్చి తెప్పించాడట.

అప్పుడింకేముంది? అంతా చెయ్యిజారే పోయింది.

పెద్దవాడు కోపాన్ని నిలవదొక్కుకున్నా చిన్నవాడు నాలుగూ దులిపేశాడు – 'నీ పిసినారితనం మండా' అని.

తర్వాత తన జబ్బులో కూడా ఈ పిసినారితనమే చూపించాడు. కాని తీరా చనిపోయాక చూస్తే – అదే ఆశ్చర్యం వేస్తుంది. అతను చనిపోయిన మరునాడు ఆ ఆశ్చర్యకరమైన విషయం బయట పడింది.

అసలు గందరగోళం అతను చనిపోయిననాడే బయలు దేరింది. డబ్బు అవసరమయి యినుప బీర్వా తెరుస్తే అందులో ఒక యాభై రూపాయలు మాత్రం వున్నాయట, వాటిలో ఒక చీటీ –

'..కర్మల కొరకు వృథా వ్యయం చేయకండి. వీలునామా వ్రాసి వుంచాను. శ్రీరాములు నాయుడుగారి వద్ద వుంది.'

ఆసరికి శ్రీరాములు నాయుడుగారు వూర్లో లేరు. టెలిగ్రాం పైన మర్నాటికి వచ్చారు.

సీలు వేయబడిన కవరు విప్పి చూశారు. అందులో రిజిష్టరు చేసి అట్టే పెట్టిన వీలునామా వుంది.

'..బ్యాంకులో వున్న పద్దెనిమిది వేల రూపాయలు నా స్వార్జితం..'

అందులో ఒక్క దమ్మిడి అయినా కొడుకుల పేర వ్రాయలేదు.

ఆ సొమ్మంతా ఆ వూళ్లో వున్న పాఠశాలను పునర్నిర్మించటానికి విరాళంగా యిస్తూ ముగ్గురు ధర్మకర్తలను నియమించాడు. ఒకరు శ్రీరాములు నాయుడుగారు. రెండు, ఆ వూరు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు. మూడు తన పెద్ద కుమారుడు.

యీ వీలునామా విన్నవారందర్నీ ఆశ్చర్యంలో ముంచేసింది.

ఒక్క పెద్ద కుమారుడు మాత్రం ఆశ్చర్యపోలేదు.

అతడు వీలునామాకన్నా ముందు తండ్రి వ్రాసిన వుత్తరం చదువుకున్నాడు.

'..చిన్నవాడు అర్థం చేసుకోలేదు నువ్వైనా అర్థం చేసుకుంటావని నమ్మకం లేదు. కాని ఆశ వుంది.

నీకు నా చిన్నతనపు గాథ తెలియదు. నీకే కాదు యీ ప్రాంతాల ఎవ్వరికీ తెలియదు.

నేను వట్టి అదృష్టహీనుణ్ణి – ఎందుచేతంటే లక్షాధికారి కడుపున పుట్టాను. ఆ లక్షాధికారైనా జ్ఞానమున్న మనిషైతే బాధ లేకపోను.

నేను లక్షాధికారి బిడ్డననే జ్ఞానం నేను నాల్గవ ఫారం చదువుతుండగానే కలిగింది. అందుచేత నేను చదువు కోవలసిన అవసరం లేదనే నిర్ణయానికి చాలా వేగమే వచ్చేశాను. లక్ష రూపాయలూ జీవితాంతం వరకూ కూర్చుని తిన్నా సరిపోతాయి అని లెక్క కట్టడానికి ఆ చదువు చాలు కదూ?

తర్వాత మా నాన్న పోయాడు. ఆరు మాసాలకు మా అమ్మ కూడా పోయింది.

లక్ష రూపాయలూ నా చేత బడ్డాయి. కాని జీవితాంతం వరకూ సరిపోతుందనుకున్న డబ్బు జీవితం ఆరంభించిన కొద్ది సంవత్సరాలకే శూన్యమవటం ఆశ్చర్యకరం.

కారణం గ్రహించావా?

మా నాన్న డబ్బయితే గడించి యిచ్చాడు. కాని ఖర్చు పెట్టడం, సక్రమమైన మార్గాల వినియోగించడం, నేర్ప లేదు.

జరిగిందేమంటే –

తమ్ముడు పుట్టిన సంవత్సరం మీ అమ్మ పెద్ద జబ్బు పడిపోయింది. జబ్బు నుంచి లేచేసరికి చాలా అసహ్యంగానూ, ముసలిదానిలాగానూ అగపడింది నా కంటికి. అప్పటికి నాకు పాతికేళ్లు.

నా సౌందర్యతృష్ణ యినుప బీర్వాలోంచి ప్రవాహాన్ని బయలుదేర తీసింది.

యిది ఒక మార్గం.

నా బీర్వా చాలా త్వరగా ఖాళీ అవుతుండటం గమనించి అంతకన్నా ఎక్కువ వేగంతో నిండే పద్ధతి కూడా అవలంబిస్తే బాధ లేదు కదా అని సదుద్దేశంతో 'గుర్రప్పందే'లనూ 'బ్రాకెట్ల'నూ ఆశ్రయించాను.

ఇది రెండవ మార్గం.

మూడు –


పై వాట్లో కష్టనష్ట నిష్ఠూరాలను మరిచిపోడానికి నిషాను ఆశ్రయించాను.

చచ్చు లక్ష రూపాయలనగా ఎంత? నాలుగేళ్లలో శూన్యమయింది.

ఇంతలో ఒక సంఘటన ఫలితంగా నా కళ్లు తెరవబడ్డాయి. కాని అప్పటికి మిగిలిందేమీ లేదు. సిగ్గు విడిచి చెప్పుకుంటే మా యిరువురి శరీరాలు, పుట్టెడు రోగాలు మాత్రం వున్నాయి. యింకా పోతే లక్ష రూపాయలు ఖర్చు పెట్టి సంపాదించిన కొద్ది అనుభవజ్ఞానం మాత్రం మిగిలింది. చివరకు దానిని ఉపయోగించే పునర్నిర్మాణం ఆరంభించాను.

ఉన్న లొడ్డూ లొసుగూ తెగనమ్మితే మూడు వేల రూపాయలు వచ్చాయి. అందులో కొద్దిగా ఖర్చుపెట్టి కొన్ని గిల్టు ఆభరణాలు కొన్నాను.

ఆ స్టంటు వేషంతో కొన్ని వందల మైళ్లు దాటి యీ వూరు వచ్చేశాము. గ్రహగతి మారటం చేతనో లేక నా పురుష ప్రయత్నం చేతనో మళ్లా తల యెత్తాను.



నా జీవితమల్లా విచారించిన విషయం ఒక్కటే. అది నే చేసిన పొరపాటు గురించి.

ఆ పొరపాటు ధనం వ్యయం చెయ్యటం కాదు. వెదవ లక్ష రూపాయలూ పోయినందుకు నేనొక్కనాడూ విచారించలేదు. నా ఆరోగ్యం పాడయింది. నా ఆరోగ్యమే కాదు – ఆ యిల్లాలు ఆరోగ్యం కూడా ధ్వంసమయింది. బ్రతికిన న్నాళ్లు ఎప్పుడీ ప్రాణాలు పోతాయా అని లోలోన నరకయాతన పడ్డాను. అనుక్షణం, దీనికంతటికీ అసలు కారణమయిన మా తండ్రిని శపించే వాణ్ణి – అతణ్ణి కాకపోతే అతని మూఢత్వాన్ని. మా రోగం మందులకు లొంగని రోగం. అందుచేతే మీ తల్లి జబ్బులో హాస్పిటల్‌కు తీసుకు వెళ్లలేదు. మీ తల్లే బలవంతంగా నిరాకరించింది. నేను కూడా చివరకు మహాయాతన – నా పాపాలకు తగిన శిక్ష అనుభవించాను. అయితే పెదవి కదపలేదు.

నేను చనిపోయే ముందు ఆలోచించాను.

మా తండ్రి చేసిన పొరపాటే నేను చెయ్యదలచుకోలేదు.

మిమ్మల్ని మీ అంతట మీరు బ్రతికే స్థితికి తెచ్చాను. అంతే మీకు నేను చేయవలసింది. యీ పాఠం నేను తదితర జీవాల నుండి నేర్చుకున్నాను. సృష్టిలో ఒక్క మానవుడు తప్ప తదితర జీవులన్నీ బిడ్డలకు చేసేది అంతవరకే!

స్వార్జితం కాని విత్తం మనిషి పాలిట తప్ప మహాభయంకరమైనది. అందుకే అది సత్కార్యంకు వినియోగిస్తున్నాను. దీనిని అపార్థం చేసుకోబోకు..'

ఈ వుత్తరం ఒక్క పెద్ద కుమారుడు తప్ప యింకెవ్వరూ చదవలేదు. ఆ వుత్తరం అతను జాగ్రత్తగా భద్రపరిచాడు. నారాయణగారి తత్వం గ్రామీయులకు మాత్రం నాటికీ నేటికీ ఊహ్యంగానే మిగిలిపోయింది.

*

*(1947 'రూపవాణి' దీపావళి సంచిక)*

## కథాంతరంగం



నాకు పెళ్లైన ఒక సంవత్సరం తరువాత నా పెద్దకొడుకు పుట్టడానికి ఒక సంవత్సరం ముందు 'అర్థం కాని మానవగాథ' పేరిట రూపవాణిలో ఓ కథ రాశాను. తండ్రులూ కొడుకుల మధ్య సంబంధం గురించి రాసిన కథది. కథరాయడం చేతకాని దశలో రాసిన కథ. ఇటీవలే కథానిలయంలో నాకు దొరికింది. ఆ తరువాత అందరి మన్నన అందుకున్న నా అన్ని కథల్లాగే ఈ కథ కూడా చాలా మందికి నచ్చింది. ఎందుకు నచ్చిందంటే నా అరవై ఏళ్ల జీవితాన్ని ఎరిగిన సన్నిహితులు, నా పిల్లలు కూడా నా జీవిత గమనాన్ని నిర్దేశించడంలో ఈ కథ ప్రభావం వుందని కచ్చితంగా చెప్పారు. నే రాసిన ఆఖరి కథ 'అన్నెమ్మ నాయురాలు' కథ రాయడానికి కావలసినంత కాలం, కొన్ని భోగట్టాలు సరిచూసుకోడానికి అవకాశం వంటివి కొరవడటం వల్లనే ఏడోనెలలో పుట్టిన నెలతక్కువ బిడ్డలా ఇంక్యుబేటర్‌లో వుంది. ఎందరో మహానుభావుల మెప్పులందుకున్న నా యితర కథలతోపాటూ ఇవీ నాకిష్టమైన కథలే.